అమెరికా తెలుగు సంఘం, అమృత్‌కిరణ్ సంయుక్తంగా నిర్వహించిన కథలపోటీలో సాధారణ ప్రచురణకు ఎన్నికైన పొందినకథ

# గిరివింద గింజలు



-పాలెపు బుచ్చిరాజు

కార్మికసంఘం నాయకుడు రామారావుకేమీ పాలుపోవడం లేదు.

వారంరోజుల్నుంచీ ఫ్యాక్టరీ యాజమాన్యంతో సంప్రదింపులు జరుగుతున్నాయి.

వాళ్ళు కాలు కేస్తే మెడకీ, మెడకేస్తే కాలుకీ బిగించి నట్లు ఎన్నాళ్ళు మాట్లాడినా జీతాలు పెంచడానికేమాత్రం ఒప్పుకోవడంలేదు.



కార్మికులందరికీ నాయకుడుగా, తను వాళ్ళని ఉద్రేకపరచి ఉంచాడు.

వాళ్ళంతా "ఊ!" అంటే సమ్మె చేసేయడానికి ఉద్యుక్తులై ఉన్నారు మరొక రెండు రోజులుంటే పరిస్థితి చేజారిపోయే ప్రమాదం కూడా లేకపోలేదు.

అప్పుడిక పోలీసు కాల్పులూ, లాఠీదెబ్బలూ లాకొట్లూ తప్పవు.

ఫ్యాక్టరీ అధికార్లకీ, ఓనర్లకీ ఎంత చెప్పినావారు వినిపించుకోవడం లేదు. వాళ్ళతో పోరాటం ఏనుగుతో ఢీ కొనడం లాంటిదని రామారావుకి తెలుసు. అయినప్పటికీ పరిస్థితిని ఇంతవరకూ తీసుకురాకతప్పలేదు.

పగలనకా, రాత్రనక, రక్తాన్ని చెమటగా మార్చి, షిఫ్టుల్లో పనిచేసి కార్మికులు యంత్రాల్ని నడిపితే కాని ఓనర్ల కడుపునిండదు.

ఇంతాచేసి వారి కడుపులు మాత్రం అర్ధాకలితో మాడవలసిందే!

లక్షలలకి లక్షలు లాభాలార్జించేవారు, కష్టపడినవారికి కడుపునిండా పెట్టేందుకు అలా వెను దీస్తారెందుకో!

పోనీ మేం అడిగేదేదైనా అధికంగా అడుగు తున్నామా అంటే అదీకాదు.

మాచేయి ఎల్లప్పుడూ క్రిందా, వారిచేయి పైనా అవడంవల్లనే ఇదంతా!

ఈ రోజుల్లో ఎవరి హక్కులు వారు పొందడానికే పోరాడవలసి వస్తోంది.

తామూ, తమపిల్లలూ, ఏసీ రూముల్లో, కారుల్లో, జల్సాలు చేస్తూ పండగముందు బోనసు నివ్వమంటే బీద అరుపులు అరుస్తారీ యజమానులు.

ఏ రోజు కూలి ఆరోజే నూనెకీ, బియ్యానికీ, పప్పులకీ, హరించుకు పోతూంటే, తమకి పండగలెక్కడినుంచి వస్తాయి.

గుడ్డిలో మెల్లగా, కాస్తో కూస్తో వారందరిలోకీ ఎక్కువ సంపాదిస్తున్న తనకే సంసారాన్ని నెట్టుకురావడం ఎంత కష్టంగా ఉందో రామారావూ చూస్తూనే ఉన్నాడు.

అక్కడెక్కడో దుబాయిలో కూరగాయలు కిలో ఇరవై రూపాయలని. "ఆ! మరీ బడాయి!" అని పించేదప్పుడు.

ఇప్పుడిక్కడ తనే పావుకిలో అయిదు రూపాయలకి కొనుక్కుతింటున్నాడు.

కూరగాయలమ్ముకునే వాళ్ళు కూడా కిలో ఖరీదుచెప్తే జనాలు ఒక్కసారే మూర్ఛపోతారనే భయంతో పావుకిలో ఖరీదు చెప్పి అమ్ముకుంటున్నారు.

సరే ఇంక నిత్యావసర వస్తువుల ధరలు చెప్పనే అక్కర్లేదు. ఏ దుకాణానికి వెళ్ళినా, "దాని ఖరీదు ఇంత ఉందా?" అంటే, "ఇవ్వాళే కొనుక్కుపోండి! రేపు ఇంకా పెరుగుతుంది" అని భయపెడుతున్నారు.

తన చిన్నతనంలో రూపాయికి కిలో బియ్యం కొనుక్కునే వాళ్ళమని చెప్తే, తన పిల్లలు తమాషాగా నవ్వుకునే రోజులొచ్చాయి.

ఓ సామాన్య మానవుడికి జీవితంలో లభించవలసిన సౌకర్యాలు గగన కుసుమాలయ్యాయి.

హక్కులంటూ కొన్నింటిని నిర్వచించుకోవడం! వాటి కోసం పోరాడడం ప్రజల్లో ఒక ఫ్యాషన్‌గా మారిపోయింది.

అభిమాన సంఘాలు కోరినట్టుగానే సినీనటులు నటించాలని శాసించే రోజులొచ్చాయి.

విద్యార్థులు కోరినట్టుగానే విద్యావిధానంలో మార్పులు చేయవలసి వస్తోంది. అన్యాయాన్ని అక్రమాన్ని ఎదుర్కోవడం కోసం ఏర్పడిన సామూహిక సంఘాలు, స్వార్థపరుల చేతిలో కీలు బొమ్మలై, తమ అస్తిత్వాన్ని కోల్పోతున్నాయి.

ఎక్కడో జరిగిన ఓ సంబంధంలేని సంఘటనని, స్వార్థానికుపయోగించుకుని, తద్వారా రాజకీయపరంగా లాభాలు పొందే కుహనా నాయకులు లెక్కకు మిక్కిలిగా అవతరిస్తున్నారు.

తప్పుచేస్తే ఏ శిక్ష పడుతుందోననే భయం ఎవర్లో ఏకోశానా ఉన్నట్లు కనిపించదు.

పైగా కావలసినంత పబ్లిసిటీ వస్తుందనే ఆనందం తాండవిస్తుంది. ఇట్టి విపత్కర పరిస్థితుల్లో విప్లవం వస్తేకాని ఏ దేశమూ చక్కబడదు.

ఆలోచించిన కొద్దీ రామారావుకి బుర్రవేడెక్కిపోతోంది.

ఏమైనా తననే నాయకునిగా భావించి, వారి భావిని తీర్చిదిద్దుతాడన్న ఆశలు తనపై నింపుకున్న తోటి కార్మికుల హక్కుల్ని కాపాడితీరాలి.

అందుకు ఎంత త్యాగమైనా చేయాలి అని నిశ్చయించుకున్నాడు.

పట్టు విడవకుండా యాజమాన్యంతో సంప్రదింపులు జరిపి ఆరోజు వాళ్ళకోరికలు తీర్చేందుకు అంగీకరించకపోతే రేపు నిరాహారదీక్ష ప్రారంభించక తప్పదని హెచ్చరించి వచ్చాడు.

బైట కార్మికులంతా రామారావుకి బ్రహ్మరథం పట్టారు. "మేమంతా నీతో ఉన్నాం, మాప్రాణాలైనా ఇవ్వడానికి సిద్ధం" అని జయజయధ్వానాలు చేశారు.

ఆరోజు సాయంత్రానికి యాజమాన్యం లొంగిపోక తప్పలేదు.

సమ్మె విజయవంతం అయింది. ఆనందంతో కార్మికులంతా కేరింతలు కొట్టారు.

రాబోయే డబ్బు లెక్కచేసుకుంటూ ఉత్సాహంతో ఎవరిళ్ళకు వాళ్ళు చేరుకున్నారు.

కానీ ఆరోజే అన్ని వస్తువుల ధరలూ మళ్ళీ పెరిగిపోతాయనీ, తమకి కొనే శక్తి పెరిగిన కొద్దీ, వస్తువులకి ధరలు పెరిగేశక్తి వస్తుందనీ, ఇదొక విషవలయం అనీ, వారికెవరు చెప్పగలరు.

డిమాండ్ అండ్ సప్లై న్యాయం అందరికీ తెలిసికూడా అర్థం కాని నిత్యసత్యం ఎవరికీ తెలిదనీ...


ఏది ఎలా ఉన్నా రామారావుకి చాలా సంతోషంగా ఉంది. తన ప్రయత్నం సఫలం అయింది. జీతాలు పెరిగాయి. వేన్నీళ్ళకీ, చన్నీళ్ళు తోడయ్యాయి. రేపట్నుంచీ వచ్చిన దాంట్లో కొంతైనా పిల్లల కోసం పొదుపు చేయొచ్చు అనుకుంటూ ఇల్లు చేరుకుని ఆరోజు ఇంట్లో అందరికంటే ముందుగా నిద్రపోయాడు రామారావు.

మర్నాడు రోజూకంటే ఆలస్యంగా నిద్రలేచాడు అలిసిన శరీరం నొప్పులు పెడుతోంది. విపరీతమైన బద్ధకంగా ఉంది. ఇంకా అలాగే పడుకోవాలని ఉంది. కాని తన శ్రీమతి పార్వతి పెరట్లో ఎవరితోనో గట్టిగా మాట్లాడుతోంది.

అవతలి ఆడమనిషి అంతకంటే బిగ్గరగా సమాధానం చెపుతోంది. వద్దనుకున్నా తనకి వారిద్దరి సంభాషణా వినిపిస్తోంది.

"అదేమిటే! మొన్నటికి మొన్న దీపావళికే కదా జీతం పెంచాను. మళ్ళీ మధ్యలో ఇలా పదిరూపాయలు పెంచమంటే ఎలా? ఇల్లా అస్తమానం పెంచుకుంటూ పోవడానికి డబ్బులు ఏమైనా చెట్టుకి కాస్తున్నాయా?" అంటోంది పార్వతి.

"మీరే అలాగంటే ఎలాగమ్మా! కనీసం నెలకి పది



కెంచు చిన్నన్న , చిన్న మెట్ పల్లి (పోస్ట్), కోరుట్ల (మం.), కరీంనగర్(జిల్లా)- 505 453

రూపాయలైనా పెంచకపోతే నాకష్టం చాలదండమ్మగోరూ! మీరిచ్చిన నాలుగు డబ్బులతోనే బువ్వొండుకు తినాల. పిల్లకీ, నాకూ బట్టలు కొనుక్కోవాల. ఏరోజు కారోజు ధరలు ఎలా పెరిగిపోతన్నాయో మీరే సూత్తన్నారుగందా! మీరు కాదంటే మేము ఏమైపోవాలమ్మా" అంటోంది గంగమ్మ.

"నువ్వలాగంటే కుదరదే రంగీ! ఇలా సంపాదించుకున్న నాలుగ్గురాళ్ళూ మీకే పంచిపెట్టేస్తే మరి మాకు మిగలేదేముంటుంది. ఇంట్లో పిల్లకి చదువులు చెప్పించుకోవాలి. చిన్నాచితకో ఓ ఇల్లొకటి కొనుక్కుందామనుకుంటున్నాము. ఇవన్నీ ఎలా సాధ్యం అవుతాయి? అయినా నీకేవేవో ఖర్చులున్నాయని మమ్మల్ని జీతం పెంచమని వేధించడం మంచిదికాదు. ఆమాత్రం ఖర్చులు తగ్గించుకోలేవూ? ప్రతీ పండక్కీ కొత్త బట్టలు కొనేసుకోవాలేంటి?" అంది పార్వతి.

"అదేంటమ్మా! అలాగంటారు? కడుపున పుట్టిన బిడ్డలకో గుడ్డముక్కెట్టుకోవాలని ఏ తల్లికి మనసుండదు? మీకు కోరికలేదా ఇల్లు కట్టుకోవాలని? అయినా నేనేమైనా వందలడిగేసేనా వేలడిగేసేనా? ఓ పదిరూపాయలు ఎక్కువియ్యమన్నాను అంతేగదా! దానికే మీరింత బాధపడిపోతన్నారు. ఇలాగైతే నేను మీ ఇంట్లో పనిచేయలేనండమ్మగోరూ! ఇంకా చెప్పుతున్నా ఏడాదిలో ఓసారి, దీపావళికి ఓ నెలజీతం బోనసు కూడా ఇవ్వాల. ఇట్టముంటే సెప్పండి. లేకుంటే మరో ఇల్లు చూసుకుంటాను.రెక్కల కష్టంమీద బతికేదాన్ని" అంది గంగమ్మ.

ఇంతవరకూ పడుకునే అంతావింటూన్న రామారావుకి,అసలే నిద్రాభంగం కావడంతో చిర్రెత్తుకొచ్చింది.

కోపంగా అరుస్తూ "పార్వతీ! ఓసారిలారా!" అని కేకేశాడు.

లోపలికి వచ్చిన పార్వతితో "గంటసేపట్నుంచీ వింటున్నాను. ఏమిటీ దాని వితండవాదన? జీతం పెంచకపోతే మానేస్తానని బెదిరిస్తోంది నిన్ను. ఎంతకండకావరం? పదిరూపాయలు కాదుకదా! పదిపైసలు కూడా పెంచను పొమ్మను. నాలుగు రోజులు పిల్లలూ అదీ ఆకలిలతో మాడిచస్తేకాని తెలిసిరాదు. రోజులెలా మారిపోయాయి? పనిమనుషుల్తోకూడా మాట్లాడలేకపోతున్నాం! అందరూ ఎదురుతిరిగి జవాబు చెప్పేవారే.! మంచీ చెడ్డా ఆలోచించడం కూడా లేదు!" అన్నాడు.

"ష్! గట్టిగా అరవకుండీ. అది మాట అంది అంటే, మానేసినా మానేయవచ్చు. ఈరోజుల్లో పనిమనుషులు మాత్రం ఎక్కడ దొరికిచస్తున్నారు! ఏ ఫ్యాక్టరీలోనో ఏ చిన్నపనికైనా, దానికేపోతున్నారు. అది 'ఉద్యోగం' అవుతుంది. ఇక్కడయితే 'అంట్లుతోమే పని మనిషి' అంటారు. దానినేదో మంచిమాటలాడితే మనింట్లో పనిచేసిపోతోంది. ఏదో నేను నచ్చజెప్పి చూస్తాను. కాదూ కూడదంటే ఆ పదీ పారేద్దాం! ఇంటెడు చాకిరీ నోరుమెదపకుండా చేస్తుంది. దానికామాత్రం ఇచ్చినా తప్పులేదు. మీరూరుకోండి." అంది పార్వతి.

బైటనుండి ఈ సంభాషణ విన్న గంగమ్మ అంది.

"అవును బాబూ! మాకేమైనా సంఘాలున్నాయా?

సమ్మెలు చేయడానికి? మాకెవరు ప్రావిడెంటు ఫండులిస్తారు? పండగలకి సెలవులెవరిస్తారు. పని ఎక్కువ చేయాలి తప్ప. మాకు కరువు భత్యాలున్నాయా? బోనసులున్నాయా? మీకొచ్చినన్ని జీతాలు మాకురాకపోయినా, మేమూ ఆ కిలో ఇరవైరూపాయల కూరలే కొనుక్కోవాల!

ఆ కిలో నలభై రూపాయల నూనె కొనుక్కోవాల. ఆ కిలో పదిరూపాయల పంచదారే టీనీళ్ళలో ఏసుకోవాల! మరి మీరు సప్పినట్టు పిల్లలు మాడి చావవలసిందే గదా బాబూ!


ఆ పదిరూపాయలూ మీరే దాసుకోండిబాబూ! నేనెల్తన్నానమ్మా!" అని విసవిసా నడిచిపోసాగింది గంగమ్మ.

"గంగమ్మ! గంగమ్మ! వెళ్ళకు గంగమా! ఆ పదీ పెంచుతాములే. గిన్నెలు పడేశా తోమేసి మరీ పో!" అంటూ దానివెంట పడింది పార్వతి.

రామారావుకి నిన్న ఫ్యాక్టరీలో నిర్ణయం చేసేముందు ఏం జరిగి ఉంటుందో ఊహించుకోవడంలో ఎక్కువ సమయం పట్టలేదు.


పి.బి. రాజు
36, సంకేశ్వర్ సొసైటి,
మకర్‌పురా రోడ్,
బరోడా - 390009.

## ముఖం లేని మనిషి



నా ముఖాన్ని
ఎక్కడో పారేసుకున్నాను
అస్సలెలా వుంటుందో
మర్చిపోయాను.
ఒకసారి అద్దంలోకి
దగ్గరగా ముఖం పెట్టాను
అద్దం పగుళ్ళువారి
వెయ్య ముక్కలయ్యింది
నా ముఖం కోసం
వెతుక్కుంటున్నాను
అద్దంలోంచి
వెయ్యి ముఖాలు
నా వంక విచిత్రంగా పరికిస్తూ
వేరొక-
క్రొత్త ముఖం తగులుకుందని
తెలీదు నాకు.

-శ్రీకాంత్‌వర్మ
132/2, హెచ్ బి. కాలనీ,
భవాని పురం,
విజయవాడ-12.




నన్నం సుధాకర్ రావు, చంద్రశేఖర పురం,రాచర్ల పాడు(పోస్ట్),నెల్లూర్ (జిల్లా) - 624 316.